పలు ప్రాంతాల్లో వర్షం



గొందిరెడ్డిపల్లిలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడడంతో ఎగసి పడుతున్న మంటలు

చెట్లపై పిడుగులు



శిరిగేదొడ్డిలో ఎగిరిపడిన రేకులు

అనంతపురం అర్బన్/రాప్తాడు/గుమ్మఘట్ట/గార్లదిన్నె, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలతో కూడిన వర్షం పడింది. ఉరవకొండ, యాడికి, పెద్దవడుగూరు, గుత్తి, బొమ్మనహాళ్, విడపనకల్లు, రాప్తాడు, రాయదుర్గం తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. అనంతపురం, పుట్లూరు, శెట్టూరు, నార్పల తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలోని ఎస్సీ కాలనీలో టెంకాయ చెట్టుపై పిడుగు పడటంతో మంటలు ఎగిసిపడ్డాయి. చేలరేగిన మంటలను స్థానిక ప్రజలు నీళ్లతో ఆర్పివేశారు. పిడుగు పడే సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. గుమ్మఘట్ట మండలంలోని శిరిగేదొడ్డి గ్రామంలో ఈదురుగాలులకు జైపాల్‌కు చెందిన షెడ్డు రేకులు ఎగిరి, కిలోమీటరు దూరంలో పడ్డాయి. ప్రమాదంలో గ్రామానికి చెందిన వృద్ధురాలు గాదీరమ్మ తలకు రాయి తగిలి గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆమెను రాయదుర్గం ఆస్పత్రికి తరలించారు. రంగచేడు గ్రామంలో కొబ్బరిచెట్టుపై పిడుగుపడటంతో మంటలు వ్యాపించాయి. అక్కడక్కడ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారు. గార్లదిన్నె మండలం పెనకచెర్ల గ్రామానికి చెందిన ఆనందరెడ్డి చీనీ తోటలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో పెద్దఎత్తున మంటల వ్యాపించాయి. ఆ సమయంలో తోటలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



అనంతపురం నగరంలో కురుస్తున్న వర్షం



చల్లటి జల్లులు..!

అనంతపురం నగరంలో ఆదివారం పగలంతా మండే ఎండతో జనం విలవిల్లాడారు. కాలు బయటకు పెట్టాలంటేనే బెంబేలెత్తిపోయారు. ఇంట్లో ఉందామంటే ఉడుకుతో ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమైంది. కాసేపటికే జల్లులు పడ్డాయి. ఎండ, ఉక్కపోతతో అల్లాడిపోయిన అనంతవాసులకు హాయిని పంచాయి. హమ్మయ్య.. అంటూ జనం ఉపశమనం పొందారు.

సొల్లాపురంలో తాగునీటికి కటకట



నీటి కోసం బిందెలతో క్యూకట్టిన సొల్లాపురం గ్రామస్థులు

కణేకల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొల్లాపురం గ్రామంలో మంచినీటికి తీవ్ర కటకట ఏర్పడింది. శ్రీరామిరెడ్డి మంచినీటి పథకం కార్మికులు ఆందోళన చేస్తుండడంతో విధులకు ఎవరూ హాజరు కావడం లేదు. దీంతో గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రత్యామ్నాయ నీటి వనరులు లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు ఫిల్టర్‌నీటిని అందించేందుకు స్థానిక టీడీపీ నాయకుడు నీలకంఠారెడ్డి ఏర్పాటు చేసిన ఫిల్టర్ కేంద్రం వద్ద ప్రజలు బిందెలు పట్టుకుని, క్యూలైన్‌లో నిలబడుతున్నారు. నీటి కోసం గ్రామం మొత్తం ఫిల్టర్ పాయింట్ వద్దకు చేరుకుంటుండడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సోమవారం నుంచి మూడురోజుల పాటు గ్రామంలో శ్రీసీతారామ ఆంజనేయ విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఉండడంతో బంధువులు పెద్దసంఖ్యలో వచ్చారు. దీంతో నీటికి తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. అధికారులు స్పందించి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఫ్యాక్షన్ టెన్షన్..!

గుంతకల్లుకు చిప్పగిరి ఫ్యాక్షన్

సరిహద్దు కావడంతో కార్పణ్యాలకు వేదికగా పట్టణం

20 ఏళ్లయినా నివురుగప్పిన నిప్పులా కక్షలు

గుంతకల్లు శివారు ప్రాంతాలు, రైలు వంతెనలే టార్గెట్

7

ఎమ్మార్పీఎస్ నేత దారుణ హత్య

ఆస్పత్రి ముందు కుటుంబసభ్యులు, ఎమ్మార్పీఎస్ నేతల ధర్నా



ఇన్నోవా వాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురవ టౌన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 మధ్యాహ్నం ఒంటిగంట వరకు రెవెన్యూభవన్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

కార్పొరేట్‌లోనూ ఉచిత విద్య..!

విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్లు

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

వందలాది మంది పేద పిల్లల చదువుకు ఊతం



అనంతపురం విద్య, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఒకటో క్లాస్ చదవాలన్నా.. లక్షలు కుమ్మరిస్తున్న కాలం ఇది. కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్ అంటే ఆ మాత్రం చెల్లించుకోవాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో సైతం విద్యాహక్కు చట్టం కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచిత సీట్లు కల్పిస్తోంది. స్టేట్ సిలబస్ మాత్రమే కాకుండా సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్‌ను చెబుతున్న కార్పొరేట్ స్కూళ్లలో సైతం ఫ్రీ సీట్లు పొందే వెసలుబాటు కల్పిస్తోంది. గుర్తింపు పొందిన అన్ని స్కూళ్లలో 1వ తరగతిలో 25 శాతం ఉచితంగా సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చదవాలన్న పేద విద్యార్థుల కలను సాకారం చేయనుంది. ఉచిత సీట్ల భర్తీకి విద్యాశాఖ సోమవారం నుంచే దరఖాస్తులు కోరనుంది.

ఆ సీట్లు ఎవరెవరికి...?

విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు ఉచితంగా భర్తీ చేయాల్సి ఉంది. వాటిలో అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు ఇలా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు 5 శాతం, షెడ్యూల్డ్ కులాలకు చెందిన పిల్లలకు 10 శాతం, షెడ్యూల్ తెగలకు చెందిన వారికి 4 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీల్లో అల్పాదాయం (రూరల్ ప్రాంతంలో కుటుంబాలకు వార్షికాదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షల వార్షికాదాయం ఉన్న తల్లిదండ్రుల పిల్లలకు) 6 శాతం సీట్లు కేటాయిస్తారు. ఒక స్కూల్‌లో ఉన్న మొత్తం సీట్లలో 25 శాతం ఉచితంగా కేటగిరీల వారీగా భర్తీ చేయాల్సి ఉంటుంది.

వీరంతా అర్హులు...

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్‌ను చెబుతున్న స్కూళ్లలో ప్రవేశానికి విద్యార్థులు 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మార్చి 31 మధ్య పుట్టి ఉండాలి. స్టేట్ సిలబస్ అమలు చేస్తున్న స్కూళ్లలో ప్రవేశం కోసం 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్య జన్మించి ఉండాలి. ఈ అర్హతలున్న అనాథలు, హెచ్ఐవీ బాధిత తల్లిదండ్రుల పిల్లలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, తక్కువ వార్షిక ఆదాయమున్న ఓసీల పిల్లలు అర్హులుగా విద్యాశాఖ నిర్ణయించింది.

ఇవి ఉంటే ఈజీ..

2025-26 విద్యా ఏడాదికి ఉచిత సీట్ల కోసం విద్యార్థులు.. సంబంధించిన పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తల్లిదండ్రుల ఆధార్, ఓటరు, రేషన్ కార్డులు, ల్యాండ్ డాక్యుమెంట్, ఉపాధి హామీ జాబ్‌కార్డ్, పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, విద్యుత్ బిల్లు, ఇంటి అద్దె కాపీ వంటి పత్రాలు ఉండాలి. వీటిలో ఏదో ఒక దానితో విద్యార్థుల బర్త్ సర్టిఫికెట్ ఆధారంగా అప్లై చేసుకోవచ్చు. వివరాలకు 18004258599 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదించవచ్చు. విద్యార్థులు తమ ఇంటి సమీపంలోని స్కూళ్లను ఎంచుకునే అవకాశం ఇచ్చింది. సోమవారం నుంచీ వచ్చేనెల 15వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోడానికి విద్యాశాఖ గడువు విధించింది.

గందరగోళం వీడేనా...?

పేద విద్యార్థులు 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలు రెండేళ్లుగా గందరగోళానికి తావిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్న వారిలో అర్హులను ఎంపిక చేసి.. స్కూళ్ల కేటాయిస్తారు. తీరా స్కూళ్ల వద్దకు ఉచిత అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు.. తమ పిల్లలతో కలిసి వెళితే.. పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాగోలా చేరిన తర్వాత ఫలానా అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు ఇలా ఏదో ఒక వంకతో ఫీజులు లాగుతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కొందరు ప్రైవేటు స్కూళ్ల సంఘాల నాయకులు కోర్టులను ఆశ్రయించడంతో కొంత గందరగోళం ఏర్పడింది. సీట్లు, ఫీజులు ఉచితం అనే అంశంపై స్పష్టత ఇవ్వాలనీ, తమ సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ గందరగోళానికి ఈ విద్యా ఏడాదైనా తెర పడుతుందని లబ్ధిదారులు ఆశపడుతున్నారు.

రిజిస్టర్ చేసుకోవాలని ఆదేశాలిచ్చాం: ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం



విద్యాహక్కు చట్టం కింద పేద ఉచిత అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. జిల్లాలో 486 స్కూళ్లు ఉన్నాయి. అన్ని గుర్తింపు పొందిన స్కూళ్ల నమోదు చేసుకోవాలని ఎంఈఓలను ఆదేశించారు.

పీఆర్ పీఐయూకి దిక్కెవరు?

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీరాజ్ పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్‌కు) దిక్కెవరు అన్న విధంగా తయారయింది. ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ అంటే ఎక్కువ మంది క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లేవారు ఉంటారనుకుంటే పొరపాటే. ఈ విభాగంలో వారి కంటే క్లరికల్ సిబ్బంది, అటెండర్లే ఎక్కువ ఉన్నారు. కార్యాలయానికి మొత్తం సిబ్బంది హాజరయ్యారంటే పిచ్చిపాటి కబుర్లు చెప్పుకుంటూ కాలం గడిపేస్తారన్న ప్రచారం జరుగుతోంది. పని లేనప్పుడు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని కార్యాలయ వర్గాలే చెప్పుకొంటున్నాయి. దీంతో సిబ్బంది కార్యాలయానికి ఇష్టారాజ్యంగా రావడం ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలయినా అక్కడ ఉన్న సిబ్బందిని ఫలాన వారు ఎక్కడ అని అడిగితే ఇంకా రాలేదు, వస్తారు అని చెప్పడం ఆనవాయితీగా మారింది. వీరు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే వారు కాదు. 12 గంటలయినా కార్యాలయానికి రాకపోవడం ఏమిటని అడిగే నాథుడే కరువయ్యారు. సమీపంలోనే ఎస్ఈ కార్యాలయం ఉన్నా ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వీరి ఆటలకు అంతులేకుండా పోయిందన్న విమర్శలు ఉన్నాయి.

సమయపాలన పాటించని సిబ్బంది

ఆంధ్రజ్యోతి విజిట్

పర్యవేక్షించాల్సిన వారే చుట్టపు చూపుగా వస్తున్న వైనం..

ఇష్టారాజ్యంగా విధులకు హాజరు

ఆంధ్రజ్యోతి విజిట్‌లో బట్టబయలు



శనివారం 12:05 గంటలకు క్లరికల్ సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న సీట్లు..

పర్యవేక్షించాల్సిన వారే చుట్టపుచూపుగా..

ఈ కార్యాలయంలో సిబ్బందిని మొత్తం పర్యవేక్షించే అధికారి ఉన్నారు. పర్యవేక్షించాల్సిన అధికారే చుట్టపుచూపుగా కార్యాలయానికి వస్తుండటంతో సమస్య జఠిలంగా మారింది. శనివారం ఉదయం 10.30 గంటలకు ఆంధ్రజ్యోతి విజిట్ చేపట్టింది. అప్పటికే చాలా మంది రాలేదు. ఈఈ పీఏ (డీఈ) భరత్ ప్రకాష్‌రెడ్డి ఎక్కడ అని అడిగితే కలెక్టర్ కార్యాలయంలో సమావేశానికి వెళ్లారని చెప్పారు. జిల్లా అకౌంట్స్ అధికారి పద్మావతి గురించి ఆరా తీస్తే.. మేడం ఇంకా రాలేదు.. వస్తారని చెప్పుకొచ్చారు. అంతలోపే ఈఈ ప్రభాకర్‌రెడ్డి, ఆయన పీఏ భరత్ ప్రకాష్‌రెడ్డి పనిమీద ఎస్ఈ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పని ముగించుకొని పీఐయూ కార్యాలయంలోని తమ చాంబర్‌లో కూర్చున్నారు. అప్పటికే 12 గంటలు కావస్తోంది. జిల్లా అకౌంట్స్ అధికారితో పాటు కొందరు క్లరికల్ సిబ్బంది రాలేదు. ఈఈ ప్రభాకర్ రెడ్డి వచ్చినట్లు సిబ్బంది అకౌంట్స్ అధికారికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. 12.30 గంటలకు అకౌంట్స్ అధికారి కార్యాలయానికి వచ్చారు. అంతలోపే అకౌంట్స్ అధికారి చాంబర్, మరి కొందరు క్లర్కులు రాని ఫొటోలు ఆంధ్రజ్యోతి తీసుకుంది. ఈలోపే కొందరు క్లర్కులు.. మేం వచ్చాం సార్.. కొందరు రాలేదు సార్.. అని ఈఈకి చెప్పే ప్రయత్నం చేశారు. ఈలోపే అకౌంట్స్ అధికారి కూడా ఈఈ చాంబర్‌కు వచ్చారు. కొంచెం పని ఉండి రాలేకపోయాను సార్ అని చెప్పుకొచ్చారు. అడక్కుండానే ఆమె ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చిందో ఈఈకి అంతు చిక్కలేదు. ఏదైనా అవసరం ఉంటే మీ అనుమతి తీసుకుంటాం సార్.. ఈరోజు వ్యక్తిగత పని ఉండటంతో కొంత ఆలస్యమయిందని చెప్పుకొచ్చారు. ఈఈకి కొంతసేపు ఏమి జరుగుతోందో అర్థం కాలేదు. ఆంధ్రజ్యోతి తీసుకున్న ఫొటోలపై ఈఈతో చర్చించారేమో అన్న తొందరపాటుతో ఇటు సిబ్బంది, అటు అకౌంట్స్ అధికారి అడ్డంగా దొరికిపోయారు. ఎవరికి వారు భుజాలు తడుముకున్నారు. సమయపాలన పాటించాలని, ఇలా చేయడం సరికాదని ఈఈ ప్రభాకర్ రెడ్డి సిబ్బందిని మందలించారు. దొరికితే దొంగ లేదంటే దొర అన్న చందంగా పీఐయూ సిబ్బంది సమయపాలన తయారయింది. ఇన్‌చార్జ్ ఈఈ క్షేత్రస్థాయి తనిఖీలకు వెళుతుండటంతో పీఆర్ కార్యాలయంతో పాటు పీఆర్ పీఐయూ కార్యాలయ సిబ్బందికి సైతం కాపలా ఉండటం కష్టం. పక్కనే ఉన్న ఎస్ఈ ఎప్పుడైనా కార్యాలయాన్ని పరిశీలిస్తే ఇలాంటి సమస్యలు తలెత్తవని తెలుస్తోంది. ఎస్ఈగా జహీర్ అస్లాం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పీఐయూ కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదన్న చర్చ జరుగుతోంది. దీంతో కార్యాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

సమయపాలన పాటించాల్సిందే



కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాల్సిందే. ఎవరైన అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఇబ్బందులు తప్పవు. క్షేత్రస్థాయి పర్యటనతో పాటు పీఆర్ ఈఈ కార్యాలయంలో చేయాల్సినంత పని ఉంటుంది. అలాంటిది నేను ఇక్కడే ఉండి చూడటం ఇబ్బందికరం. కార్యాలయానికి వచ్చినపుడు సిబ్బంది అందుబాటులో లేకపోతే సహించేది లేదు.

-ప్రభాకర్‌రెడ్డి, ఈఈ, పీఆర్ పీఐయూ

అప్పులబాధతో యువరైతు ఆత్మహత్య



యువరైతు రాజశేఖర్ (ఫైల్)

కంబదూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతిమడుగు గ్రామానికి చెందిన యువరైతు రాజశేఖర్ (32) అప్పుల బాధ భరించలేక ఆదివారం పురుగుల మందు తాగి తన తోటలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. రాజశేఖర్‌కు ఐదెకరాల పొలం ఉంది. అందులో కర్బూజ, టమోటా, వేరుశనగ పంటలు సాగు చేస్తుండేవాడు. పంటలు పండక పెట్టుబడులు కాక చేతికిరాక రూ.10 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. వాటిని ఎలా తీర్చాలోనని సతమతం అవుతుండేవాడు. ఈ నేపథ్యంలో ఈనెల 26న సాయంత్రం తోటలోకి వెళ్లాడు. అప్పుల విషయంతో తీవ్ర మనస్తాపం చెంది అక్కడే పురుగుల మందు అపస్మారక స్థితిలో పడిపోయాడు. చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు తోటకు చేరుకుని, రాజశేఖర్‌ను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. రైతుకు భార్య కళ, ఎనిమిదో తరగతి చదువుతున్న పవిత్ర, నాలుగో తరగతి చదువుతున్న పల్లవి పిల్లలు ఉన్నారు. రైతు మృతదేహానికి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆత్మహత్యపై కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీతోనే మత్స్యకారుల అభివృద్ధి

ఎన్నికల హామీని నెరవేర్చిన సీఎం చంద్రబాబు

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత


అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే మత్స్యకారుల అభివృద్ధి సాధ్యమవుతుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అనంతపురం నగరంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చారని తెలిపారు. మత్స్యకారుల సేవలో పథకంలో భాగంగా వేట నిషేధ సమయంలో మత్స్యకారుల భృతిని రూ.20వేలకు పెంచడంపై గంగపుత్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకారులకు మోసపూరిత హామీలు ఇచ్చి, తీరని అన్యాయం చేశారన్నారు. ఫిష్ ఆంధ్రా పేరుతో రూ.300 కోట్లు దుర్వినియోగం చేశారని తెలిపారు. 2014 సంవత్సరంలో తొలిసారిగా వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశపెట్టిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. మత్స్యకారులు వేట సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు పరిహారం ఇస్తారని తెలిపారు.

ముగ్గురు 'ఉపాధి' సిబ్బంది అరెస్టు

7

ఫ్యాక్షన్ టెన్షన్..!

- గుంతకల్లుకు చిప్పగిరి ఫ్యాక్షన్
- సరిహద్దు కావడంతో కార్పణ్యాలకు వేదికగా పట్టణం
- 20 ఏళ్లయినా నివురుగప్పిన నిప్పులా కక్షలు
- గుంతకల్లు శివారు ప్రాంతాలు, రైలు వంతెనలే టార్గెట్



గుంతకల్లు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ కర్నూలు జిల్లా చిప్పగిరి మండలానికి చెందినదే అయినా, హత్యలకు గుంతకల్లు పట్టణం వేదికగా మారింది. ఫ్యాక్షన్ గ్రామంలో వైరివర్గాలు అప్రమత్తంగా ఉంటూ శత్రువుల కదలికలపై నిఘా పెట్టి జాగ్రత్తలు పాటిస్తుండటంతో, పగ తీర్చుకోవడానికి బయటి ప్రాంతాలనే ఎంచుకుంటూ 40 ఏళ్లలో రక్తపుటేర్లను పారించారు. గుంతకల్లుకు శివారు గ్రామంగా చిప్పగిరి ఉండటంతో గ్రామస్థులు ప్రతి చిన్న విషయానికీ గుంతకల్లుకు వస్తుంటారు. ఆస్పత్రులు, కోర్టు కేసుల కోసం గుంతకల్లుకు రావాల్సిన పరిస్థితులుండటంతో ఫ్యాక్షన్ హత్యలకు గుంతకల్లు వేదికగా మారింది. గుంతకల్లు శివారులో 2000లో బెల్దోన అశోక్ హత్య సంచలనం రేపింది. ఇప్పుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్యతో గుంతకల్లు ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. లక్ష్మీనారాయణది ఫ్యాక్షన్ హత్యా, అతడి ఇతర శత్రువుల పన్నాగమా అనే విషయం బహిర్గతం కావాల్సి ఉంది. ఫ్యాక్షన్ హత్యల్లో నిందితుడిగా ఉన్న లక్ష్మీనారాయణ మృతి స్థానికంగా మరెన్ని అనర్థాలకు దారితీస్తుందోనని గుంతకల్లు ప్రజలను టెన్షన్‌కు గురిచేస్తోంది.

రెండు తరాలుగా హత్యలు..

చిప్పగిరి కేంద్రంగా ఏర్పడిన కక్షలు, కార్పణ్యాలు గుంతకల్లులో రక్తపుటేరులను పారించాయి. చిప్పగిరి మండలం రాజకీయంగా టీడీపీకి వ్యూహాత్మక ప్రాంతం. ఇక్కడ మెజారిటీ సాధించిన పార్టీ అభ్యర్థే ఎంపీగా గెలుపొందే అవకాశం ఉంది. చిప్పగిరి మండలంలో వైకుంఠం శ్రీరాములు టీడీపీలో పట్టున్న నాయకుడు. శ్రీరాములును బలహీనపరిస్తే తప్ప.. కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలవలేరన్న కారణంగా ఆ పార్టీ నేతలు ఈ మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. శ్రీరాములు కాంగ్రెస్‌లోకి రాడని నిర్ధారించుకుని అతడి సమీప బంధువులను కాంగ్రెస్‌లోకి తెచ్చారు. బెల్దోన అశోక్‌కు తన గ్రామంలోనే బలమైన మరో వర్గంతో శత్రుత్వం ఏర్పడింది. దాంతో 80వ దశకంలో ఆధిపత్యపోరు ఫ్యాక్షన్ రూపం దాల్చింది. గుంతకల్లు పట్టణంలోని పాత బస్టాండు వద్ద చిప్పగిరి నారాయణ అనే వ్యక్తిపై బాంబు వేసి, ప్రత్యర్థులు హతమార్చారు. ఈ నేపథ్యంలో గుంతకల్లు శివారులోని ఆలూరు రోడ్డు రైలు వంతెన వద్ద కొందరు కాపుకాచి బైక్‌పై వస్తున్న బెల్దోణ ప్రభాకర్, వెంకటేశులుపై బాంబులు విసిరి చంపేశారు. అలాగే గుంతకల్లు పట్టణంలోని వాసవీ కల్యాణమండపం ఎదుట వైకుంఠం నారాయణ స్వామి అనే వ్యక్తిని హత్య చేశారు. తర్వాత గుంతకల్లు శివారు బళ్లారి రోడ్డులో బెల్దోణ అశోక్ కారును జీపుతో ఢీకొట్టి, తుపాకీతో పేల్చి చంపారు. గుంతకల్లు మండలం ఎన్ తిమ్మాపురంలో టీచరుగా పనిచేస్తున్న కావలి శ్రీనివాసులును దారికాచి చంపారు. ఆ తర్వాత కొన్నాళ్లకే నల్ల ఆంజనేయులు అనే వ్యక్తిని దౌల్తాపురం రైలు వంతెన వద్ద కాపుకాచి ప్రతీకార హత్యచేశారు. అశోక్ హత్యకు ప్రతీకారంగా 2006లో చిప్పగిరి టీడీపీ నాయకుడైన వైకుంఠం శ్రీరాములు, ఆయన భార్య శకుంతలమ్మను ప్రత్యర్థులు ఇంటిపైకే దాడికి వెళ్లి హత్యలు చేశారు. ఆ ఘటనతో గుంతకల్లుకు ఫ్యాక్షన్ పాకుతుందేమోనని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అప్పటి నుంచి గుంతకల్లు ప్రాంతంలో చిప్పగిరి కేంద్రంగా ఇక్కడ హత్యలు జరగలేదు. తాజాగా గుంతకల్లు శివారులోని ఆలూరు రోడ్డుపై రైలు వంతెన వద్ద చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్య చేయడంతో మరలా ఈ ప్రాంతంలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

హత్య భయం ఉన్నా..

టీడీపీ మాజీ నాయకుడు వైకుంఠం శ్రీరాములు, ఆయన భార్య శకుంతలమ్మ 2006లో హత్యకు గురయ్యాక ఆ కేసులో ఏ-7గా ఉన్న చిప్పగిరి లక్ష్మీనారాయణ ఇంటి వద్ద పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు. లక్ష్మీనారాయణపై హత్యా ప్రయత్నం జరిగే అవకాశం ఉన్నందున పోలీసులు ప్రత్యేక రక్షణ కల్పించారు. ఈ నేపథ్యంలో రైల్వే టెండరు కోసం గుంతకల్లుకు వచ్చిన లక్ష్మీనారాయణ వద్ద ఆయుధాలున్నట్లు తెలియడంతో స్థానిక వన్‌టౌన్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మూడు నెలల క్రితం చిప్పగిరిలో పోలీసు పికెట్‌ను తొలగించారు. ఈ నిర్ణయంలో ఓ పోలీసు అధికారి హస్తం ఉందంటూ లక్ష్మీనారాయణ ఇటీవల ఆరోపణలు చేశారు. ప్రత్యర్థుల నుంచి లక్ష్మీనారాయణకు ప్రాణ భయం ఉన్నా పంచాయితీలకు వెళ్లేవాడని సమాచారం. ఈ విషయంగా కొన్ని ఘర్షణలూ జరిగాయి. ఈ పరిస్థితుల్లో లక్ష్మీనారాయణ హత్యకు గురికావడం చర్చనీయాంశంగా మారింది. ఇది ఫ్యాక్షన్ హత్యా, ఇది పంచాయితీల కారణంగా ఏర్పడిన శత్రుత్వాల వల్ల జరిగిన ఘటనా? అన్న దానిపై సందిగ్ధత నెలకొంది. విచారణ చేపట్టిన పోలీసులు వివరాలను వెల్లడించాల్సి ఉంది.

ఎమ్మార్పీఎస్ నేత దారుణ హత్య

- టిప్పర్‌తో ఢీకొట్టి కొడవళ్లతో నరికిన దుండగులు
- మృతుడు కాంగ్రెస్ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కూడా..



హత్యకు గురైన చిప్పగిరి లక్ష్మీనారాయణ



రోదిస్తున్న లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు

గుంతకల్లు/గుంతకల్లుటౌన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ (60) హత్యతో గుంతకల్లు ఉలిక్కిపడింది. ఆయనను పట్టణ శివారులో దుండగులు టిప్పర్‌తో ఢీకొట్టి, కొడవళ్లతో నరికి చంపారు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండల కేంద్రానికి చెందిన లక్ష్మీనారాయణ ఆదివారం ఉదయం కుమారుడు వినోద్‌కుమార్, సమీప బంధువు గోవిందుతో కలిసి గుంతకల్లుకు వచ్చారు. మధ్యాహ్నం ఇన్నోవా వాహనంలో చిప్పగిరికి బయల్దేరారు. గుంతకల్లు-ఆలూరు రహదారిలో పట్టణ శివారులోని రైలు వంతెన సమీపాన స్పీడ్ బ్రేకర్ వద్ద ఇన్నోవా వాహనాన్ని టిప్పర్‌తో ఎదురుగా వచ్చి దుండగులు ఢీకొట్టారు. దుండగులు వెంటనే లక్ష్మీనారాయణను బయటకు లాగి, కొడవళ్లతో అతడి తల, వీపు మీద నరికారు. తర్వాత కారులో పరారయ్యారు. స్థానికులు వెంటనే చిప్పగిరి లక్ష్మీనారాయణ, వినోద్‌కుమార్, గోవిందును గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి లక్ష్మీనారాయణ చనిపోయినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, చిప్పగిరి గ్రామస్థులు పెద్దఎత్తున గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆస్పత్రి ఎదుట ధర్నా

చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు, మృతుడి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆదివారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలనీ, పత్తికొండ డీఎస్పీపై విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. ఎస్పీ వచ్చి హామీ ఇచ్చేవరకు ధర్నా విరమించే ప్రసక్తేలేదని భీష్మించారు. రెండు గంటలపాటు ధర్నా చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆనంద్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పటించుకునేందుకు యత్నించారు. అక్కడే ఉన్న నాయకులు.. అతడిపై నీళ్లు పోశారు. ఆస్పత్రి వద్దకు డీఎస్పీ శ్రీనివాస్ చేరుకుని, ధర్నా విరమించాలని సూచించారు. ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడించారు. ఎస్పీ రావాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ఎస్పీ జగదీష్ ఆస్పత్రి వద్దకు చేరుకుని, మృతుడి కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులతో మాట్లాడారు. నిందితులను అరెస్టు చేసి, తమకు న్యాయం చేయాలని లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు కోరారు. ఎస్పీ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అలర్ట్ చేశామనీ, 24 గంటల్లో హత్యకేసు నిందితులను పట్టుకుంటామని చెప్పారు. దీంతో ధర్నా విరమించారు. అనంతరం హత్యాస్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. డీఎస్పీని అడిగి వివరాలు తెలుసుకున్నారు.



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



శ్రీరామ్ (ఫైల్)

బొమ్మనహాళ్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన కౌలు రైతు శ్రీరామ్(33) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అదే ఊరికి చెందిన ఆనందరెడ్డికి చెందిన ఆరెకరాల భూమిని శ్రీరామ్ కౌలుకు తీసుకుని, పంటలు సాగు చేస్తుండేవాడు. వారం రోజుల క్రితం సజ్జ పంట పెట్టాడు. శనివారం అర్ధరాత్రి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. అప్పటికే మోటారుకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో దానిని తాకిన శ్రీరామ్ షాక్ తగిలి, మరణించాడు. చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి, కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబీకులు తోటలోకి చేరుకుని, బోరున విలపించారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. రైతుకు భార్య మహాలక్ష్మి, కుమారుడు శీనా, కుమార్తె చందు ఉన్నారు. దీనిపై బొమ్మనహాళ్ పోలీసులను అడగ్గా.. తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- 108 ఆలస్యం... ప్రైవేటు వాహనంలో తరలింపు

కూడేరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలాపురం గ్రామం వద్దనున్న పెట్రోల్ బంక్ సమీపంలో ద్విచక్రవాహన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆదివారం మహేష్, ఫాతిమా, చిన్నారి శ్యామ్ ద్విచక్రవాహనంలో అనంతపురం నుంచి ఉరవకొండకు వెళ్తుండగా.. ముద్దలాపురం దాటిన తర్వాత పెట్రోల్ బంకు వద్ద కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురయింది. ప్రమాదంలో గాయపడ్డ వారిని 108 వాహనంలో తరలించేందుకు కాల్ సెంటర్‌కు సమాచారం పంపారు. సకాలంలో వాహనం రాకపోవడంతో ప్రైవేటు వాహనంలో తరలించారు. బాధితులు కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

వేడి నీళ్లు పడి చిన్నారి మృతి

హిందూపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నన్నారి వేర్లు ఉడకబెట్టే సమయంలో ఆ వేడి నీరు పడి చిన్నారి మరణించాడు. మండలంలోని వీవర్స్ కాలనీలో నివాసమున్న జుబేర్ తన ఇంటిలో శనివారం నన్నారి తయారు చేయడానికి వేర్లు ఉడక బెడుతున్నాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న జుబేర్ కుమారుడు జాన్(2)పై వేడినీళ్లు పడ్డాయి. తీవ్రంగా గాయపడిన చిన్నారిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

1 నుంచి ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల నేపథ్యంలో మే 1 నుంచి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా జవహర్ బాల భవన్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ప్రమీల ఆదివారం ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ నుంచి జూన్ 12 వరకూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ చిత్రలేఖనం, టైలరింగ్‌పై శిక్షణ ఉంటుందన్నారు. 6 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగ్గురు 'ఉపాధి' సిబ్బంది అరెస్టు

విడపనకల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడిన ముగ్గురు ఉద్యోగులను అరెస్టు చేసినట్లు విడపనకల్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో కొంత మంది సిబ్బంది నకిలీ జాబ్ కార్డులను సృష్టించి పనులు చేయకున్నా చేసినట్లు బిల్లులు ఖాజేశారని తెలిపారు. ఈ విషయమై విడపనకల్లు ఎంపీడీఓ షకీలాబేగం ఫిర్యాదు మేరకు ఫిబ్రవరి 8వ తేదీన 8 మంది ఉపాధి హామీ సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. వీరిలో కంప్యూటర్ ఆపరేటర్ సుభాన్, కరకముక్కల ఫీల్డ్‌అసిస్టెంట్ రామస్వామి, పాల్తూరు ఫీల్డ్ అసిస్టెంట్ గురుస్వామిని శనివారం విడపనకల్లులో అరెస్టు చేశామన్నారు. వీరిని ఉరవకొండ మండల తహసీల్దారు, మండల మేజిస్ట్రేట్ మహబూబ్ బాషా ముందు హాజరు పరచగా వీరికి ఏడు రోజులు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దీంతో నిందితులను బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లిలోని జిల్లా జైలుకు తరలించామని పేర్కొన్నారు.

మిగిలిన వారి సంగతేంటి..?

ఫిర్యాదుల దినోత్సవంలో పాత ఎంపీడీఓ శ్రీనివాసులుపై ఆధారాలతో ఆర్థిక శాఖ మంత్రికి ఫిర్యాదు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధిహామీ పనుల్లో దాదాపుగా రూ. 1.19 కోట్ల అవినీతి జరిగిందని, పంచాయతీల్లో రోడ్లు వేయకున్నా వేసినట్లు ఎం.బుక్‌లు రికార్డులు చేసి బిల్లులు కాజేశారని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. డ్వామా అధికారులు మాత్రం రూ.18.36 లక్షలు మాత్రమే అవినీతి జరిగిందని, ఎనిమిది మంది ఉపాధి హామీ సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించారు. రికవరీ జాబితాలో పాత ఎంపీడీఓ(పీఓ) శ్రీనివాసులు మొదట ఉన్నా.. ఆయన్ను మాత్రం వదిలేసి మిగిలిన వారిపై కేసులు నమోదు చేయించారు. దీంతో కొంత మంది ప్రజలు ఈ నెల 8న విడపనకల్లులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ అవినీతి అక్రమాలపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఫిర్యాదు చేశారు. స్వయంగా మంత్రి డ్వామా అధికారులను పిలిచి విచారించి ఎంపీడీఓపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినా.. జిల్లా అధికారులు కేసును నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మిగిలిన ఐదుగురిని అరెస్టు చేస్తారా? లేక వదిలేస్తారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎంపీడీఓపై క్రిమినల్ కేసు నమోదు చేయకుండా జిల్లా అధికారులే వెనుకేసుకొస్తున్నట్లు చర్చలు జరుగుతున్నాయి.

పెనుకొండకు జిల్లా కోర్టు

- జిల్లా న్యాయాధికారి భీమ్‌రావు



జిల్లా న్యాయాధికారికి స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అన్ని వసతులున్న పెనుకొండకు జిల్లా కోర్టు రానుందని, ఆ మేరకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని జిల్లా న్యాయాధికారి భీమ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పెనుకొండకు వచ్చిన జిల్లా న్యాయాధికారికి సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బొజ్జప్ప, అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి స్థానిక అధికారులతో కలిసి జిల్లా కోర్టుకు కావాల్సిన సముదాయం, కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం పలు ప్రాచీన దేవాలయాలు సందర్శించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల సంఘం ఉమ్మడి అనంత జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథి రెడ్డి పర్యవేక్షణలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఏడీ రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రసన్నబాయి, కార్యదర్శిగా మల్లేష్ గౌడ్, కోశాధికారిగా జీఎస్ అమర్, సహాయ కార్యదర్శిగా ఖదీర్ బాషా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు.. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పశుసంవర్ధక శాఖ జేడీలు వెంకటస్వామి, సుభదాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గానికి పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎకాలజీ సెంటర్‌లో 45రోజుల పాటు కంప్యూటర్‌లో శిక్షణ, అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 20-35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. మే 1వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హతగల నిరుద్యోగులు వెంటనే ఎకాలజీ సెంటర్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రచనలకు శారీరకలోపం అడ్డు కాదు

- ఆచార్య బాలసుబ్రహ్మణ్యం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సాహిత్య రచనలకు శారీరక లోపం అడ్డు కాదని 'స్వాతి చినుకు' నవలా రచయిత పీజీ వెంకటేష్ నిరూపించారని ఎస్కేయూ ఆచార్యులు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కవి పీజీ వెంకటేష్ రచించిన 'స్వాతి చినుకు', 'మన ప్రభుత్వాధినేతలు' పుస్తకాల ఆవిష్కరణ సభను తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించారు. ఆచార్య బాలసుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తకం రాయడమంటే కేవలం హస్తభూషణమే కాదు, మనో భూషణం, మేధో భూషణం కూడా అని వెంకటేష్ రుజువు చేశారని అన్నారు. స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన ఉంది కాబట్టే రచయిత 'స్వాతిచినుకు' నవల రాయగలిగారని, అలాగే 'మన ప్రభుత్వాధినేతలు' పుస్తకంలో నేతలు, రాష్ట్రాల సంక్షిప్త సమాచార గ్రంథంగా వెలువరించడం అభినందనీయమన్నారు. తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య ఏవీ రమణ, సీనియర్ కవి తూముచెర్ల రాజారాం, విశ్రాంత ప్రిన్సిపాల్ రంగస్వామి, జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, అంకె శ్రీనివాస్, ట్రినిటి మానసిక వికలాంగుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజామణి, అంకె రామలింగయ్య, గోసల నారాయణస్వామి, మధురశ్రీ పాల్గొన్నారు.



స్వాతి చినుకు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీకారులు

హ్యాండ్‌బాల్‌లో శ్రీసత్యసాయి జట్టు ప్రతిభ

- రాష్ట్రస్థాయి టోర్నీలో మూడో స్థానం కైవసం



ట్రోఫీతో శ్రీసత్యసాయి జిల్లా జట్టు

కదిరిఅర్బన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని శ్రీతాయి సూర్యనారాయణ (ఎస్‌టీఎస్ఎన్) డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించిన 54వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆతిథ్య జట్టు ప్రతిభ చాటింది. రెండ్రోజులపాటు సాగిన ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. మూడోస్థానం కోసం నిర్వహించిన మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీసత్యసాయి జిల్లా, విజయనగరం జట్లు తలపడ్డాయి. శ్రీసత్యసాయి జిల్లా జట్టు 20-12 తేడాతో గెలుపొందింది, మూడోస్థానంలో నిలిచింది. టోర్నీలో కర్నూలు జిల్లా జట్టు చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్ మ్యాచ్‌లో కర్నూలు, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. కర్నూలు జట్టు 22-13 పాయింట్ల తేడాతో గెలిచి, ట్రోఫీని సొంతం చేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అనంతరం విజేత జట్లకు కెనరా బ్యాంకు మేనేజర్ విజయకుమార్, పేబ్యాక్ సంస్థ అధ్యక్షుడు ధనుంజనాయుడు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన రజక విద్యార్థులు ప్రతిభాపురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని రజక ఉద్యోగ విద్యావంతుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కమ్మన్న, అధ్యక్షప్రధాన కార్యదర్శులు రంగనాథ్, శ్రీహరి ఆదివారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదివి 450, ప్రైవేటు పాఠశాలల్లో 480 మార్కులు సాధించిన రజక విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్మీడియట్‌లో సైన్సులో 800, ఆర్ట్స్‌లో 700 మార్కులకుపైగా వచ్చిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన రజక విద్యార్థులు మార్కుల జాబితా, కులధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లతో రజకనగర్‌లోని చిరునామాలో మే 15వతేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 9440501188, 9491871141, 8121777065, 9441698409 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

‘ఉపాధి’లో అక్రమార్కుల పెత్తనం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

● పని చేయకున్నా మస్టర్లలో పేర్లు చేర్చాల్సిందే..?
● ఉపాధి సిబ్బందిపై నేతల ఒత్తిళ్లు..?

గార్లదిన్నె, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎవరికి ఉపాధిని కల్పిస్తోందో తెలియడం లేదు. కూలీలకు ఉపాధి దేవుడికి తెలియాకానీ, అక్రమార్కుల పాలిట కల్పతరువుగా మారింది. తాము చెప్పినట్లు వినకపోతే నాయకుల కు, అధికారులకు చెప్పి మిమ్మల్ని తొలగిస్తామని పలు గ్రామాలలో క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లను బెదిరిస్తున్నట్లు సమాచారం. ఈ ఒత్తిళ్లతో కొంత మంది పనులకు వెళ్లకున్నా వెళ్లినట్లు మస్టర్లలో పేర్లు ఎక్కించాల్సిన పరిస్థితి నెలకొందని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు చర్చించుకుంటున్నారు. సొంత గ్రామాల్లో పనులు కల్పించి కూలీల వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే ఈ పథకాన్ని పలువురు అక్రమ ఆదాయ వనరుగా ఉపయోగించుకుంటున్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. దీంతో పనులు చేసిన వారికి, చేయని వారికి ఒకే విధమైన కూలీని అధికారులు మంజూరు చేస్తుండడం పలు విమర్శలకు దారితీస్తోంది. పనులు మేము చేయాలి.. కూలి మీరు తీసుకుంటారా అని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది అధికార పార్టీలోని కొందరు నేతల తీరుకు అద్దం పడుతోంది. గార్లదిన్నె మండలంలో సుమారు 11 వేలకుపైగా జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం వెయ్యి మంది వరకు కూలీలు పనులు చేస్తున్న ట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే వాస్తవంగా పనులు చేసేది కొందరైతే, పనులు చేయని వారు కొందరనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. అక్రమార్కులకు కొందరు కిందస్థాయి అధికారులు సహకరిస్తుండ డంతోనే ఇలా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధిలో జరు గుతున్న అక్రమాలపై అధికార పార్టీలో కొందరు నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఉపాధిలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు. లేకుంటే ఇటీవల నార్పలలో జరిగినట్లు జరుగుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలకు పాల్పడితే ఎవ్వరినీ ఉపేక్షించం



ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఉపాధి పథకంలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పనులకు వచ్చిన వారి పేర్లు మాత్రమే మస్టర్లలో రాయాలి. అదేవిధంగా ఉపాధి పనులను ఎక్కడా యంత్రాలతో చేయరాదు. అలా చేస్తే సంబంధిత సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
- యోగానందరెడ్డి, ఎంపీడీఓ

న్యూస్ బాక్స్

పశువుల సంత ఆదాయం రూ.4.16 లక్షలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశులసంతతో రూ.4.16 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.65 లక్షలు, ఆదివారం ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ. 1.50 లక్షలు వచ్చిందని తెలిపారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అర్బన్ పరిధిలోని పదో డివిజన్‌లో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు కంతాదేవి, రమాదేవి, శంకరమ్మ, వనజమ్మ నాయకులు ఆది, చందు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం’

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలన్నిటిలోనూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయిస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలపడం హర్షణీయమని బహుజన లాయర్స్ ఫోరమ్ (బీఎల్ఎఫ్) బానాసి నారాయణప్ప పేర్కొన్నారు. బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు ఉత్తర్వులు జారీ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారని నారాయణప్ప వివరించారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మహేశ్వరి, సాయిప్రసాద్, గణేష్ తదితరలు పాల్గొన్నారన్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్



మాట్లాడుతున్న కొనకొండ్ల రాజేష్

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పనిచేయాలని బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ పిలుపు నిచ్చారు. చెన్నేకొత్తపల్లిలో ఆదివారం బీజేపీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలతో ముందుకెళుతున్న పార్టీ అని, ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచే యాలన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తు న్న పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు శివమూర్తి, నాయకులు రత్నమయ్య, జిలకర అంజనేయులు, చైతన్యకిషోర్, నారాయణరెడ్డి, మురళీ, ఆదిశేషారెడ్డి, ఈశ్వర్, సాయిరాం, ప్రదీప్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘వరి కోనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి’

శింగనమల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రంలో వరి కోనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం రైతు సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి డిమాండ్ చేశారు. శింగనమలలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...శింగనమల చెరువు కింద, మండల వ్యాప్తంగా వేల ఎకరాల్లో వరిపంట కోత దశలో ఉందన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందించి ప్రభుత్వ వరి కోనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

పది ఫలితాల్లో ఎల్‌ఆర్‌జీ పాఠశాల సత్తా



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాప్తాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఎల్‌ఆర్‌జీ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని ఆ పాఠశాల ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు. ఎల్‌ఆర్‌జీ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాలు, పుష్ప గుచ్ఛాలతో ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు సుమియా బాను 591, అఖిల 584, సవిత582, కుమారి లక్షలాస్య 579, సృజన్ 570 మార్కులు సాధించారన్నారు. పాఠశాలలో 99 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.


పాలచెర్ల గుట్టలో ఎలుగుబంటి సంచారం?

రాప్తాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచెర్ల గుట్టలో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు గుర్తించారు. పాలచెర్ల గ్రామ శివార్లులోని గుట్టలో ఆదివారం ఎలుగుబంటి సంచరిస్తుండగా గ్రామస్థులు గమనించారు. ఎలుగుబంటి సంచరిస్తుండటాన్ని వీడియో తీసి సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. ఎలుగుబంటి కనిపించడంతో పాలచెర్ల, బోగినేపల్లి గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు, కూలీలు భయభ్రాంతులు చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేకలకుంట గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని చాకలి శివానంద (29) మృతి చెందాడు. దయ్యాల కుంటపల్లికి చెందిన శివానంద రజకవృత్తి చేసుకుని జీవనం సాగించేవాడు. ఆదివారం వ్యక్తి గత పనిమీద అనంతపురం వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా రేకలకుంట గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సునంద, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై బుక్కరాయసముదద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కజొన్న కోత యంత్రం దగ్ధం



కాలిపోతున్న మొక్కజొన్న కోత యంత్రం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మొక్క జొన్న కోత యంత్రం అగ్నికి ఆహుతైంది. మండలంలోని నరసనాయనికుంట గ్రామంలో ఆదివారం గ్రామస్థుడు కొరకూడి సుబ్బయ్యకు చెందిన మొక్కజొన్న పంట కోత కోసం బుక్కరాయసముద్రం మండలం వడియంపేట నుంచి కోత యంత్రాన్ని తీసుకొచ్చారు. పంట కోత కోసి కంకులను ట్రాక్టర్‌లో లోడు చేసే సమయంలో ఎండ వేడిమికి కోత యంత్రం ఇంజన్ వేడెక్కి మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ వాహనంలోంచి దూకేశాడు. యంత్రం పూర్తిగా కాలిపోయింది. యంత్రంలో ఉన్న మొక్కజొన్నకంకులు కాలిపోయినట్లు గ్రామస్థులు వెల్లడించారు.

ఒక్క హామీనీ నెరవేర్చని సీఎం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర ప్రయోజనాలకంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి ప్రశ్నించారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 11నెలలుగా మాటలకే పరిమితమయ్యారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా టీచర్ పోస్టులు భర్తీ చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఇప్పటికే అమరావతిలో 58వేల ఎకరాలుందని, మళ్లీ 44వేల ఎకరాలు ఎందుకని ప్రశ్నించారు. రూ.1.47లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. గతంలో మోదీ రాజధాని కోసం మట్టి, నీళ్లు తెచ్చారని, ఇప్పుడు రాజధాని పునఃనిర్మాణమని మరోసారి ప్రధానిని రప్పిస్తున్నారన్నారు. ప్రధాని మోదీ పర్యటనలో రాష్ట్రాభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయించాలన్నారు.

వైసీపీ విదార్థి నాయకుడిగా వసికేరి

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ విద్యార్థి విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కురుబ వసికేరి నియమితుడయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నియామక ఉత్తర్వులు ఇచ్చారని వసికేరి ఆదివారం ప్రకటనలో తెలిపారు.

అన్ని సీట్లూ ఆయనకే..?

● నగరపాలక సంస్థలో ఓ డీఈఈ వ్యవహారం

అనంతపురం క్రైం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరపాలికలో పనిచేస్తున్న ఓ ఇంజనీర్ మంచి జోష్‌లో ఉన్నారు. దీపముండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న ఆలోచన బలంగా ఉన్నట్లుంది. అనంతపురం కార్పొరేషన్‌లో ఆయన డీఈఈగా పనిచేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) సీటు ఖాళీ కావడంతో కొన్ని రోజులకే ఆ సీటు ఇన్‌చార్జ్‌గా తీసుకున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో కీలకమైన వాటర్ వర్క్స్, వాహనాల మరమ్మతులు, డీజిల్‌తో పాటు సివిల్ వర్క్స్ కూడా చూస్తున్నారు. ఈ క్రమంలో మిగిలిన డీఈఈలు తమకేం లేవని గుర్రుగా ఉన్నారు. తాజాగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్(ఎంహెచ్ఓ) బదిలీ కావడంతో ఆ పోస్టు ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించారు. ఇప్పుడున్న సీట్లకు బాధ్యతాయుతంగా పనిచేయడమే ఎక్కువ. కానీ ఆయన ఇంకోసీటుపైన గురి పెట్టారు. అవినీతికి అలవాలమైన టౌన్‌ప్లానింగ్‌ను కూడా చూడాలనుకుంటున్నారట. అక్కడ పనిచేస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) గత కొన్ని నెలలుగా సెలవులో ఉన్నారు. దీంతో ఆ పోస్టుకు ఇన్‌చార్జ్‌గా వేయండి అని కమిషనర్, మేయర్‌ను కోరినట్లు సమాచారం. ఇలా అన్ని సీట్లు తీసుకుని ఆదాయం సమకూర్చుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తుండటం నగరపాలికలో చర్చనీయాంశంగా మారింది.

‘లక్ష్మీనారాయణ ఎదుగుదల ఓర్వలేకనే హత్య’

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్‌లో, కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న చిప్పగిరి లక్ష్మీనారాయణ ఎగుదుల ఓర్వలేక హత్య చేయడం దారుణమని ఎమ్మార్పీఎస్ అక్కులప్ప, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ సాకే హరి ఆదివారం వేర్వేరుగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఆలూరు ఇన్‌చార్జిగా లక్ష్మీనారాయణ చురుకైన పాత్రపోషిస్తున్నారన్నారు. ఎస్సీ నియోజకవర్గమైన ఆలూరులో గతంతో దళిత కొండమ్మను హత్య చేశారని, ఇప్పుడు లక్ష్మీనారణను పొట్టున పెట్టుకున్నారన్నారు. అగ్రకుల దురహంకారానికి పరాకాష్ట అన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కూడేరు జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ధర్మవరపు బాలాజీ

ఆత్మకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పరిటాల రవీంద్ర క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కూడేరు జట్టు నిలిసింది. మండంలోని బి.యాలేరులో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బి. యాలేరు, కూడేరు జట్లు తలపడగా కూడేరు విజయం సాధించింది. విన్నర్ కూడేరు జట్టుకు రూ. 30 వేలు, విన్నర్ కప్, రన్నర్ బి.యాలేరు జట్టుకు రూ. 15వేలు నగదు బహుమతులను టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు బాలాజీ చేతులు మీదగా అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి బండి పరశురాం, ఎస్సీసెల్ నాయకుడు కర్రిఆవుల పెద్దన్న, టీడీపీ మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు, నాయకులు మోహన్‌చౌదరి, వెంకటనారాయణ, పరిటాల సుబ్రహ్మణ్యం, కర్రిఆవుల నాగరాజు, జోగి లక్ష్మీనారాయణ, ఈడిగ శివ, మొద్దు రామాంజి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా స్కేటర్స్ ర్యాలీ



టవర్‌క్లాక్ వద్ద ర్యాలీ చేస్తున్న స్కేటింగ్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా స్కేటర్స్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆదివారం స్థానిక జేఎన్‌టీయూ నుంచి శారదానగర్, కలెక్టరేట్, పూలే సర్కిల్, సప్తగిరి సర్కిల్, సుభాష్‌రోడ్డు మీదుగా టవర్‌క్లాక్ వరకు స్కేటింగ్ క్రీడాకారులు ఐదు కిలోమీటర్ల పాటు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల అణచివేతకు ప్రభుత్వం చేస్తున్న పోరుకు క్రీడాకారుల సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి రవిబాల, సీనియర్ కోచ్ నాగేంద్ర, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

● మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి



విద్యార్థులను జ్ఞాపికలతో అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా విద్యాభ్యాసం సాగించినపుడే మనకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి అన్నారు. ఇటీవల పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ ప్రగతి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కసాపురం రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, బాలల సంఘం నాయకురాలు సరళ, నాగేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు భీమేష్, నాగభూషణం, అజయ్, విజయ్, మహేష్, సురేంద్ర, మనోహర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పూర్వవిద్యార్థులంతా ఒకేచోట కలిసి ఆనందంగా నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మండలంలోని మేడాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 2002- 2003 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయసమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. విద్యార్థులందరూ ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ రోజంతా ఉల్లాసంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతుసహాయసహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

‘కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయండి’

అనంతపురం రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని టీఎన్‌టీయూసీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు తాడాల నాగభూషణం పిలుపునిచ్చారు. మండలంలోని పాపంపేటలో ఉన్న తన నివాసంలో ఆయన ఆదివారం టీఎన్‌టీయూసీ రాప్తాడు నియోజకవర్గం అధికార ప్రతినిధి మల్లికార్జునతో కలసి మీడియాతో మాట్లాడారు. మే 1న టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా విజయవాడలోని మొగల్రాజపురంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్మెంట్ కాలేజీ మైదానంలో సాయంత్రం నాలుగు గంటలకు టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామ రాజు అధ్యక్షతన వేడుకలు జరుగుతాయని తెలిపారు. టీఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల, నియోజకవర్గ స్థాయిలోనూ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాల ఐక్యత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలేపల్లిలో తాగునీటికి కటకట



కొళాయి వద్ద తాగునీటి కోసం వేచి ఉన్న మహిళలు

రామగిరి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి బీసీ కాలనీలో తీవ్రమైన తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. గ్రామంలో ఆరు పంచాయతీ బోర్లు ఉండగా అందులో మూడు పూర్తిగా ఎండిపోయాయి. మిగిలిన మూడు బోర్లలో భూగర్భజలాలు తగ్గడంతో నీరు తక్కువగా వస్తోంది. గ్రామంలోని బీసీకాలనీలో దాదాపు 200 ఇళ్ల వరకు ఉండగా వారికి తాగునీరే రావడం లేదు. వారు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి వ్యాన్లలో, ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చు కుంటున్నారు. ట్యాంకర్లు, వాహనాలులేని వారు కొళాయిల వద్దే పడి గాపులు కాస్తూ నీటిని తెచ్చుకుంటున్నారు. చేతనైనవారు ద్విచక్రవాహ నాలు, సైకిళ్లలో నీటిని తెచ్చుకుంటున్నారు. ఉగాది పండుగ నుంచి తాగునీటితో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసినా, ఎవరూ పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. రెండురోజుల తరువాత తాగునీటి కోసం ఎంపీడీఓ కార్యాలయం లేదా రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ బెస్త నాయకులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే భృతిని రూ.20వేలకు పెంచినందుకు టీడీపీ బెస్త సాధికార సమితి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ బెస్త నాయకులు మేక చంద్రబాబు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కుళ్లాయప్ప, బెస్త సాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు చేపల హరి తదితరులు ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు జైకొట్టారు. టీడీపీతోనే బెస్తలకు అన్ని రకాలుగా న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేక షణ్ముక, బెస్త నారాయణస్వామి, పవన్, జస్వంత్ వ్యాస్, వెంకటేష్, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవలు నిలిచిపోకుండా, కొనసాగింపుకోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఎఫ్‌సీఆర్ఏ చట్ట సవరణను తీసుకొచ్చి ఆర్డీటీకి వస్తున్న నిధులను నిలిపివేయడం వల్ల అన్ని రంగాల ప్రజలు నష్టపోతారన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపి ఆర్డీటీ నిధులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, మానవహక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా, ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు సాకే హరి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎల్లన్న, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఓబిలేసు, రాహుల్, శివారెడ్డి, కేశవరెడ్డి, ప్రజానాట్యమండలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం సెంట్రల్/క్లాక్‌టవర్/గార్లదిన్నె: ఐదు దశాబ్దాలుగా నిరుపేదలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పిస్తున్న ఆర్డీటీ సేవలను కొనసాగించాలని పలు ప్రజాసంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఆర్డీటీకి విదేశీ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకేహరి, ఎమ్మార్పీఎస్ నాయకుడు అక్కులప్ప, జై కిసాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఓబుళేసు, మాదిగ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్, ఎస్సీ, ఎస్టీ మానట రింగ్ కమిటీ సభ్యుడు బండారు కుళ్లాయప్ప తదితరులు ఆదివారం వేర్వేరు విలేకరుల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీపీఎంకు రఘురామ క్షమాపణ చెప్పాలి : రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉండి ఎమ్మెల్యే ఏపీ శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు.. సీపీఎంకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 40 ఏళ్లుగా ఉంటున్న 80 మంది పేదల ఇళ్లను అధికార దర్పంతో కూల్చివేయించారని విమర్శించారు. బాధితులను పరామర్శించి, నెలరోజుల్లోపు వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును అసభ్యంగా దూషించడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు.

జీపీలుగా బహుజన లాయర్స్‌ను నియమించాలి

● బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తాలూకా, జిల్లా కోర్టులు, హైకోర్టుల్లో బహుజన వర్గాల లాయర్స్‌ను ప్రభుత్వ ప్లీడర్స్ (జీపీ)గా నియమించాలని బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ నారాయణప్ప పేర్కొన్నారు. న్యాయవాదులకు ప్రభుత్వ సహాయ, సహకారాలందించాలని ఆదివారం గుంటూరు జిల్లా చీరాలలో బీఎల్ఎఫ్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడినట్లు ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా నెలకు రూ.3వేల చొప్పున యువన్యాయవాదులకు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్టైఫండ్ ఇచ్చేవారన్నారు. అదేవిధంగా హైకోర్టులో రిజిస్టర్ అయిన వారికి బుక్స్, ఫర్నీచర్ కోసం రూ.10వేల నగదు చెల్లించేవారని తెలిపారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకాన్ని తొలగించారని వాపోయారు. రిజర్వేషన్ వర్గాల లాయర్లకు పీపీ, ఏపీపీ, జీపీ, ఏజీపీ అవకాశాన్ని కల్పించాలన్నారు. సుప్రీం, హైకోర్టుల నాయమూర్తి నియామకాల్లో రిజర్వేషన్ పాటించాలని కోరారు. అలాగే పలు డిమాండ్లపై సమావేశంలో చర్చించి తీర్మాణించినట్లు తెలిపారు. అదేవిధంగా హైకోర్టు మహిళా ప్రతినిధిగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ప్రసన్నను ఘనంగా సన్మానించినట్లు ఆయన తెలిపారు.

60 మందికి ఉచిత ఖత్నా

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ బహుళార్థక సంక్షేమ సంఘం, గఫూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ గఫూర్ సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గఫూర్ కాలనీలో ఆదివారం ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 60 మందికి ఉచితంగా ఖత్నా చేయించారు. కార్యక్రమానికి ఏపీ అలైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గఫూర్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 46 సంవత్సరాలుగా ప్రతియేటా ఉచిత మెడికల్ క్యాంపుల ద్వారా నిరుపేద ముస్లింల కోసం ఉచిత ఖత్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దాదాపు 60 మంది చిన్నారులకు ఉచితంగా ఖత్నా నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ బాషా, డాక్టర్ ఆరోహి, షాకీర్, మదార్‌వలి, షామీర్, మైనార్టీ నాయకులు ఐఎంఎం మహబూబ్‌బాషా, షేక్ నిజాం, జాకీర్, షౌకాత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

అనధికారిక లేఅవుట్లలో ఇళ్లు నిర్మిస్తే కూల్చేస్తాం

● మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్



కళ్యాణదుర్గం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అనధికారిక లేఅవుట్లలో ఇళ్లను నిర్మిస్తే కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ స్పష్టం చేశారు. అనుమతులు పొందిన లే అవుట్లల్లోనే పక్కా గృహాలు నిర్మించుకోవాలని, అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన్ను ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ చేయగా పలువ విషయాలు వెల్లడించారు.

ప్రశ్న:మున్సిపాలిటీ పరిధిలో అనధికారిక లేఅవుట్లు ఎన్ని ఉన్నాయి..?

జవాబు: గత ప్రభుత్వ హయాంలోనే 32 అనధికారిక లే అవుట్లు ఉన్నాయి. ప్రతి వాటికి నోటీసులు అందజేసి రిజిస్ట్రేషన్ కాకుండా నిలిపివేశాం. దీంతో పాటు ఎక్కడైతే నిర్మాణాలు చేపట్టారో.. అక్కడ విద్యుత్ సరఫరాను నిలిపివేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఇంటింటి చెత్త సేకరణ ఎప్పటి నుంచి ప్రారంభిస్తారు?

జవాబు: ఇంటింటి చెత్త సేకరణను ఈనెల 23 నుంచే ప్రారంభించాం. పరిశుభ్రమైన పట్టణంగా మార్చడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం.

ప్రశ్న: మూలనపడ్డ చెత్త సేకరణ వాహనాలకు మోక్షం ఎప్పుడు లభిస్తుంది..?

జవాబు: కొన్నేళ్లుగా చెత్త సేకరణ వాహనాలను పూర్తిగా మూలనపడేశారు. మరలా తాను బాధ్యతలు తీసుకున్నాక ఐదు ఎలక్ట్రికల్ ఆటోలు, ఒక డీజిల్ ఆటోను మరమ్మతులు చేయించాం. ఇంటింటి చెత్త సేకరణకు అవి పూర్తిగా ఉపయోగపడతాయి.

ప్రశ్న: పట్టణంలో తాగునీటి సమస్య నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఇందుకు ఏఐఐపీ పథకం కింద రూ.180 కోట్ల నిధులు కేటాయించారు.

ప్రశ్న: సచివాలయ సిబ్బంది ప్రతి పనికి డబ్బులు అడుగుతున్నారు.?

జవాబు: మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే సచివాయ సిబ్బంది ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే తన దృష్టికి తీసుకొస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పట్టణంలో ఏయే అభివృద్ధి పనులు చేపడుతున్నారు..?

జవాబు: డంపింగ్ యార్డు స్థలంలో రూ.3 కోట్ల వ్యయంతో మున్సిపల్ భవనం, రూ.5 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పాత బస్టాండులో రూ.180 కోట్ల వ్యయంతో డ్రైనేజీ, టీసర్కిల్లో రూ.15 కోట్ల వ్యయంతో వాణిజ్య సముదాయం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

సీఐ యువరాజ్ మానవత్వం..

● పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి విద్యార్థినికి సాయం



బైక్‌పై విద్యార్థినిని, ఆమె తండ్రిని పరీక్ష కేంద్రానికి పంపిస్తున్న సీఐ యువరాజు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎంట్రెన్స్ పరీక్ష రాయడానికి వచ్చిన ఓ విద్యార్థిని దారితెలియక సతమతం అవుతున్న సమయంలో పట్టణ సీఐ యువరాజ్ దారి తెలిపి, పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి ద్విచక్రవాహనాన్ని సైతం ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. గుత్తి మండలం గాంధీనగర్‌కు చెందిన 4వ తరగతి విద్యార్థిని యమున జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో ఎంట్రెన్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకుంది. దీంతో పరీక్షరాయడానికి కుందుర్పి మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు ఆ బాలిక ఆదివారం ఉదయం తండ్రి చాకలి యల్లప్పతో కలిసి కళ్యాణదుర్గంకు చేరుకున్నారు. అక్కడి టీ సర్కిల్లో.. కుందుర్పికి వెళ్లడానికి ఏ బస్సు ఎక్కాలో తెలియక తచ్చాడుతూ ఉండగా.. ఆ సమయానికే పెట్రోలింగ్ చేస్తున్న సీఐ యువరాజు వారిని గమనించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వెంటనే ఆ ఇద్దరినీ పోలీస్ జీపులో ఆర్టీసీ బస్టాండ్‌కు తీసుకొచ్చారు. అక్కడా కుందుర్పికి వెళ్లడానికి బస్సులు లేకపోవడాన్ని గమనించిన సీఐ బాలికను సమయానికి పరీక్ష కేంద్రానికి చేర్చేందుకు గాను ద్విచక్రవాహనాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఓ కానిస్టేబుల్ ద్వారా ఆ విద్యార్థినిని, ఆమె తండ్రిని పంపించారు. విద్యార్థిని సరైన సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకునేలా సీఐ ప్రయత్నించి మానవత్వం చాటుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు.

చిన్నపాటి వర్షానికే కాలనీలు జలమయం




చిన్నపాటి వర్షానికే ఓ కాలనీలో రోడ్డుపై పెద్దఎత్తున పారుతున్న నీరు

రాయదుర్గం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికి మధుటాకీస్, దుగ్గిలమ్మ ఆలయం కాలనీలు జలమయమయ్యాయి. వర్షం వచ్చినపుడల్లా 16, 17 వార్డుల లో నీరు తమ కాలనీల్లోకి వస్తున్నాయని, దీంతో రోడ్లన్నీ నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయని ఆయా కాలనీల వాసులు వాపోయారు. డ్రైన్లు, కల్వర్టులు, సిమెంట్ రోడ్లు వేయాలని కోరుకున్నప్పటికీ అధికారులు, వార్డు కౌన్సిలర్లు పట్టించుకోలేదన్నారు. వచ్చినపుడల్లా నీరు ఇక్కడికి ప్రవహించి ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. సరైన డ్రైనేజీ కాలువలు నిర్మిస్తే వర్షపునీరు బయటకు వచ్చే అవకాశం ఉండదని వారు పేర్కొన్నారు. ఈ మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇరువర్గాల ఘర్షణ.. నలుగురికి గాయాలు

గుత్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):పట్టణంలో గాంధీ నగర్‌లో చిన్నపాటి విషయమై ఇరువర్గీయుల మధ్య శనివారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో నలుగురు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గాంధీ నగర్‌లో సుభాన్ ఇంటి వద్ద శుభకార్యం జరుగుతుండగా లక్ష్మీనారాయణ చిన్న విషయమై గొడవపడ్డాడు. ఈనేపథ్యంలో ఇరువర్గీయులు ఘర్షణకు పాల్పడి పరస్పరం దాడులు చేసుకున్నారు. అందులో సుభాన్, నబీ, లక్ష్మీనారాయణ, నారాయణమ్మ గాయపడ్డారు. బాధితులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గీయుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బద్దేనాయక్ తదితరులు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన అఖిల అనే నిరుపేద విద్యార్థినికి స్థానిక ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ ఆర్థిక సాయం చేశారు. అఖిల జీఎన్ఎం నర్సింగ్ కోర్సుకు ఫీజు కట్టే స్థోమత లేక ఇంటి వద్దనే ఉంటోంది. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ స్పందించి ఆదివారం ఆ విద్యార్థిని, ఆమె తల్లిని సంస్థ కార్యాలయం వద్దకు ఆదివారం పిలిపించి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి హరీష్ కోశాధికారి అబ్దుల్ వాహబ్, సభ్యులు ఆర్థికసాయం అందించిన వారిలో ఉన్నారు.

గుంతలున్నాయ్.. జాగ్రత్త

● అధ్వానంగా యాడికి-తాడిపత్రి రోడ్డు
● ప్రయాణించాలంటే బెంబేలెత్తుతున్న వాహనదారులు



రోడ్డు పొడవునా ఏర్పడిన గుంతలు



తిరుణాంపల్లి సమీపంలో భారీ గుంత

యాడికి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి తిరుణాంపల్లి, చిక్కేపల్లి, నిట్టూరు, బుగ్గ గ్రామాల మీదుగా తాడిపత్రికి వెళ్లే రోడ్డు మోకాళ్లలోతు గుంతలు పడి అధ్వానంగా ఉంది. ప్రయాణించాలంటే ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిక్కేపల్లి వరకు అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అడుగడుగునా గుంతలు పడ్డాయి. గత పాలకులు ఈరోడ్డు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు ఈ రోడ్డు మరీ దారుణంగా తయారైంది. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా ప్రాణాలు కోల్పోవాల్సిందేనని వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. వారం క్రితం సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేసే యాడికికి చెందిన కార్మికుడు విధులు ముగించుకుని రాత్రివేళలో ఇంటికి వెళుతూ.. రోడ్డుపై గుంతను తప్పించబోయి ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలయ్యాడు. అలాగే ఇటీవల ఎదురుగా వస్తున్న లారీ లైట్ల వెలుతురులో రోడ్డుపై గుంతలు కనపడక తాడిపత్రికి చెందిన ఒక వ్యక్తి వాహనం అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. గత ఐదేళ్లకాలంలో ఒక్కసారి కూడా ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. గత పాలకుల నిర్లక్ష్యం నేడు వాహనదారులకు శాపంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారుల కూడా ఈ రోడ్డువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ప్రస్తుత ప్రభుత్వంలో అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు మరమ్మతుకు తగు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





పామిడి, తాడిపత్రి పట్టణాల్లో నేలకొరిగిన చెట్లు

ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు



తాడిపత్రిలో కూలిన క్రికెట్ నెట్స్

పామిడి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు బలంగా వీచాయి. దీంతో స్థానిక గుత్తి రోడ్డులో సరస్వతీ విద్యా మందిరం వద్ద గల భారీ వేపచెట్టు నేలకొరిగింది. గాలులకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చిరుజల్లులుతో రోడ్లు చిత్తడిమయం అయ్యాయి.

●తాడిపత్రి: ఈదురుగాలులకు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో, పాతమున్సిపల్ కార్యాలయం, యల్లనూరురోడ్డు ప్రాంతాల్లోని చెట్లు నేలకూలాయి. అలాగే జేసీ పార్కులో క్రికెట్ నెట్స్ కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు సైతం నేలకొరగడంతో ట్రాఫిక్‌తోపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది.

●పుట్లూరు: మండలవ్యాప్తంగా భారీ ఈదురు గాలులు వీచాయి. సుమారు అరగంట పాటు వీచిన గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు కిందపడ్డాయి. మరికొన్ని గ్రామాల్లో అరటి, మొక్కజొన్న తదితర పంటలు నేలకొరిగాయి. పలుచోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో భారతీయ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి పిరికిపంద చర్య అని మండలంలోని మురిడి గ్రామ సర్పంచ్ గంగప్ప, ఎంపీటీసీ సభ్యుడు గంగాధర అన్నారు. ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గ్రామంలో ఆదివారం రాత్రి భీమ్ సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామస్థులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు మాట్లాడుతూ భారతదేశ సమైక్యతను చూసి ఓర్వలేక ఉగ్రవాదులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మృతుల ఆత్మకు శాంతి కలగాలని సంతాపం తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు బసవరాజు, ఏసప్ప, సంతోష్, హేమంత్, జయచంద్ర, కొల్లారప్ప ఇతర గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

విడపనకల్లు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బోయ ఉస్సేన్‌కు చెందిన గడ్డివామి ఆదివారం మధ్యాహ్నం పూర్తిగా దగ్ధమైంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న గడ్డి వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని, గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేశారని, మంటలు అదుపు కాక వామిమొత్తం దగ్ధమైందని బాధితుడు వాపోయాడు. సమాచారం ఇవ్వడంతో ఉరవకొండ అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటల్ని అదుపు చేసిందన్నారు. ప్రమాదంలో రూ.40వేలు నష్టం వచ్చిందని వాపోయారు.

నాటుసారా తయారీ కేంద్రంపై దాడులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాలతండాలో నాటుసారా తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ శివసాగర్ మాట్లాడుతూ నవోదయం 2.0లో భాగంగా ఈ దాడులు నిర్వహించామన్నారు. ఇందులో 375లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎస్ఐ వెంకటేశం, హెచ్‌సీలు గోపాల్‌నాయక్, పక్కరన్న, వెంకటేష్, ఈసీలు బాబ్జి, శ్యామూల్, సురేష్, నాగరాజు, సుగుణ, శైలజ పాల్గొన్నారు.

నీటి తొట్టెల ఏర్పాటు

గుత్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా పట్టణంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా ఆధ్వర్యంలో నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. స్థానిక కర్నూలు రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, గుంతకల్లు రోడ్డు, గాంధీ సర్కిల్, అనంతపురం రోడ్డు, రాజీవ్‌సర్కిల్ వద్ద నీటి తొట్టెలను ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు.

30 లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

శెట్టూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ లబ్ధిదారులు ఈనెల 30వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలంలో 2900 మంది ఈకేవైసీ చేయించుకోని వారు ఉన్నారన్నారు. వారంద రూ గడువులోగా తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలన్నారు. అలా చేయించని వారికి రేషన్ సరుకుల పంపిణీ నిలిపివేస్తామన్నారు. రేషన్‌డీలర్ల వద్దకు కానీ, వీఆర్వోల వద్దకు కానీ వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

పోలీసుల నాకాబందీ

పుట్లూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో ఆదివారం నాకాబందీ నిర్వహించినట్లు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. ప్రతిఒక్కరూ ప్రశాంతంగా జీవించాలని సూచించామన్నారు. తర్వాత అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేశామన్నారు. స్పెషల్‌పార్టీ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీటీ పునరుద్ధరణకు చర్యలు చేపట్టండి

కణేకల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేద ప్రజలకు కల్పతరువుగా ఉన్న ఆర్డీటీకి నిధుల పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అఖిలభారత యువజన సమైక్య నాయకుడు కొట్రేష్ కోరారు. ఆ సంస్థ జిల్లాలోని బత్తలపల్లి, కళ్యాణదు ర్గం, కణేకల్లు క్రాసింగ్‌లలో ఆసుపత్రుల ద్వారా పేదలకు సేవలు అందించడంతోపాటు పల్లెల్లో నిరక్షరాస్యులకు విద్యాబోధన, పేదలకు పక్కాగృహాల నిర్మాణం, ఇంటర్ విద్యార్థులకు ఉచిత విద్యాబోధన కార్యక్రమాలను నిర్వహించి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుందన్నారు. అలాంటి సంస్థ ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉన్నందున్న దానిని పునరుద్ధరించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తాడిపత్రి, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గదరగుట్టపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బుగ్గ నుంచి తాడిపత్రికి వెళ్తున్న బొలెరో వాహనాన్ని గదరగుట్టపల్లి వద్ద లారీ ఢీకొంది. ప్రమాదంలో బొలెరోలో ప్రయాణిస్తున్న గంగాధర్, శివమ్మ, హేమంత్‌లు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

యంత్రంలో చేయి పడి ఒకరికి..

తాడిపత్రి: మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఆదివారం చెట్ల నూర్పిడి యంత్రంలో చేయిపడి దస్తగిరి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. అయ్యవారిపల్లికి చెందిన దస్తగిరి కూలిపనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లిలో నూర్పిడి యంత్రం వద్ద పని చేస్తుండగా.. ప్రమాదవశాత్తు చేయి అందులో పడింది. దీంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో సర్వే

యల్లనూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ అనుమతులతో మండలంలో ఓఎన్‌జీసీ సంస్థ ఆధ్వర్యంలో ఖనిజ నిక్షేపాల కోసం సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ఆదివారం పాతపల్లి, కృష్ణాపురం యల్లనూరు పొలాల్లో సర్వేలు నిర్వహించి పరికరాలను ఏర్పాటుచేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఉరవకొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘ నంగా జరిగింది. ఆ పాఠశాలలో 2000-2001 విద్యాసంవత్సరంలో పదో తరగతి చ దివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కరిగానిపల్లిలో ఫ్లోరైడ్ నీటి సమస్య

● కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



మినరల్ వాటర్‌ను పట్టుకునేందుకు ఎగబడుతున్న గ్రామస్థులు

కుందుర్పి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానిపల్లిలో ఫ్లోరైడ్ నీటితో ప్రజ లు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీరు తాగడం వలన వివిధ వ్యాధులకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. దాదాపు మూడు వేల మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో కొన్నేళ్లుగా ఫ్లోరైడ్ సమస్య పట్టిపీడిస్తోంది. అయినా సం బంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పంచాయతీ బోర్లు నాలుగు ఉన్నాయి. వాటిల్లో నీరు పూర్తిగా ఫ్లోరైడ్‌తో వస్తున్నాయి. తాగడానికి ఏ మాత్రం ఉపయోగపడవు. ఇతర అవసరాలకు కూడా పనికిరావంటే ఫ్లోరైడ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో గ్రామస్థులు తాగడానికి మినరల్ వాటర్‌ను బిందెకు రూ.10 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ఇక ఇతర అవసరాలకు సుదూరంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రతి రోజు కిలోమీటర్ల మేర వెళ్లి నీటిని తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు వా పోతున్నారు. సమస్యను పలుమార్లు విన్నవించినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి గ్రామంలో ఫ్లోరైడ్ నీటి సమస్య నుంచి విముక్తి కలిగించాలని వారు కోరుతున్నారు.

సింహవాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు



సింహవాహనంపై దర్శనమిస్తున్న ఉత్సవమూర్తులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సింహవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలోని భూదేవి, శ్రీదేవి సమేత స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఉత్సవ విగ్రహాలను సింహవాహనంపై కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంప్‌హౌస్ వద్ద మైక్రో ఫిల్టర్ల ఏర్పాటు

● చొరవ చూపిన మంత్రి పయ్యావుల కేశవ్



కొనకొండ్ల పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మైక్రోఫిల్టర్లు

ఉరవకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో గల సత్యసాయి తాగునీటి పథకం పంప్‌హౌస్ వద్ద నీటిని శుద్ధి చేసేందుకు రూ.20లక్షలు వెచ్చించి, మైక్రో ఫిల్టర్లను ఏర్పాటు చేశారు. ఈ పంప్‌హౌస్ నుంచి దాదాపు 14 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే అక్కడ చాలా ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్లు ప్రస్తుతం సరిగా పని చేయకపోవడంతో తాగునీరు ఫిల్టర్ కావడం లేదు. దీంతో స్థానికులు సమస్యను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌కు ఇటీవల విన్నవించారు. స్పందించిన మంత్రి తక్షణమే మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు వెంటనే అధికారులు డీఎంఎఫ్ కింద రూ.5లక్షల వ్యయంతో ప్లాట్‌ఫాంను నిర్మించి, రూ.20 లక్షల వ్యయంతో 2ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మైక్రో ఫిల్టర్లను ఏర్పాటు చేశారు. నెలకిందట నుంచి మైక్రో ఫిల్టర్ల ద్వారా నీటిని శుద్ధి చేసి సంపుల ద్వారా నేరుగా సరఫరా చేస్తున్నారు. మైక్రో ఫిల్టర్ల ద్వారా 16గంటలు రన్ చేసి, 20లక్షల లీటర్ల స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నారు. అలాగే నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుతో 2ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన 2 మైక్రో ఫిల్టర్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ రూ.40లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు. ఎట్టకేలకు హామీ నిలబెట్టుకున్న మంత్రికి గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

4న ఆత్మీయ అభినందన సభ

ఉరవకొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని మాసినేని గ్రాండ్ ఫంక్షన్ హాల్లో మే 4వ తేదీన దళిత ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభ నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఆదివారం ఆయన ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చంద్రబాబు మాదిగలకు ఇచ్చిన హామీ నెరవేర్చడంలో భాగంగా ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఆర్డినెన్స్ జారీ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆత్మీయ అభినందన సభలో తొలిసారిగా ఎమ్మెల్యేలు అయిన బండారు శ్రావణి, ఎంఎస్‌రాజు, దస్తగిరి, జయసూర్యకు సన్మానం చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు సాకే భాస్కర్, భాస్కర్, వన్నప్ప, ప్రసాదరావు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయండి



ఎంపీకి సమస్య వివరిస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహోన్నూరులో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఆ గ్రామ టీడీపీ నాయకులు కోరారు. జిల్లాకేంద్రంలోని నివాసంలో ఆదివారం వారు ఎంపీని కలిసి మాట్లాడారు. గ్రామంలోని ప్రజలకు ప్లాంట్ ఏర్పాటు చేసి మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే స్థానిక దర్గానికి వచ్చే భక్తులకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశప్ప, టీడీపీ ఎస్సీ సెల్ ని యోజకవర్గ అధ్యక్షుడు ఆనంద్, బీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, నాయకులు మహ్మద్‌రఫీ, రామంజనేయులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 265 మంది హాజరు

కుందుర్పి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలోని ప్రవేశ పరీక్షకు ఆదివారం 265 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది ప్రవేశపరీక్ష రాయాల్సి ఉండగా.. 265 మంది హాజరయ్యారని, 35 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ మహేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు సరికాదు: టీడీపీ

బొమ్మనహాళ్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండూరు గ్రామ సర్పంచ్ రాధిక భర్త, వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుపై నిందలు వేయడం సరికాదని టీడీపీ నాయకులు గంట శ్రీనివాస్‌రావు, ఎర్రితాత అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం వారు లేకరులతో మాట్లాడారు. గతంలో వైసీపీ నాయకుడు రాజ్‌కుమార్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక అక్రమాలు చేశారని, అనేకమందిపై అక్రమకేసులు పెట్టించారని, బెదిరింపులు చేశారని అన్నారు. ఇప్పుడు కూడా అక్రమంగా కరెంట్ వాడుతూ పట్టుబడ్డాడన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని నిందలు వేయడం సరికాదన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకొని చేసిన అక్రమాలు ఇప్పుడు బయటికి వస్తున్నాయని తెలిపారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్



సదస్సులో మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): హమాలీలకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డీ. జగదీష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీరప్ప కల్యాణ మండపంలో ఆదివారం అనంతపురం జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. హమాలీ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి వీకే కృష్ణుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. హమాలీలను కౌన్సిలర్లుగా చేసిన ఘనత సీపీఐది అన్నారు. చమటోడ్చి కష్టపడుతున్న హమాలీలకు ప్రజలు ప్రత్యేక స్థానం ఇచ్చారని అన్నారు. హమాలీలకు ఇంటిస్థలాలు, ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. 60 సంవత్సరాలు పైబడిన హమాలీలకు ప్రభుత్వం పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాము, రామాంజనేయులు యాదవ్, సురేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.